క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఉపసర్పంచ్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి

మంథని: మంథని మేజర్ గ్రామపంచాయతీ మాజీ ఉప సర్పంచ్ పుప్పాల బాగ్యలక్ష్మి తిరుపతి దంపతులు, విలోచవరం మాజీ ఎంపీటీసీ లక్కాకుల స్వామి 30మంది అనుచరులతో బీఆర్ఎస్‌లో చేరారు. బుధవారం స్థానిక ఎస్ఎల్బీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీచైర్మన్ పుట్ట మధు సమక్షంలో పార్టీలో చేరగా మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



వైద్య శిబిరం సందర్శనలో తహసీల్దార్

జ్యోతినగర్: ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రామగుండం తహసీల్దార్ జాహేద్ పాషా అన్నారు. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ న్యూపోరట్‌పల్లి కమ్యూనిటీ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధిక వర్షాల కారణంగా ప్రజలకు అందుబాటులో వైద్యం అందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచనల మేరకు శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. రామగుండం ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ నిర్మల వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి



చెరువును పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేశ్

యైటింక్లయిన్‌కాలనీ: వారంరోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రామగిరి ఎంపీడీవో రమేశ్ కోరారు. రామగిరి మండలం ముస్త్యాల గ్రామంలో బుధవారం ఎంపీవో భాస్కర్, సర్పంచ్ లావణ్యతో కలసి గ్రామంలో పర్యటించారు. గ్రామ సమీపంలోని చెరువు నీటి మట్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు పలు సూచనలు చేశారు. రైతులు పొలాల వద్దకు వెళ్లవద్దని, పాడుబడిన, శిథిలా వ్యవస్థలో ఉన్న ఇళ్లలో ఎవరూ ఉండొద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సురేశ్, కార్యదర్శి పర్శరాం పాల్గొన్నారు.

వరద ముంపు బాధితులను ఆదుకోవాలి



సమస్యలు తెలుసుకుంటున్న మనాలి ఠాకూర్

జ్యోతినగర్: జెన్‌కో యాష్‌పాండ్ నీటితో ముంపునకు గురైన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ మనాలీ ఠాకూర్ డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్, సుభాష్‌నగర్, మోమీన్‌నగర్‌లో బుధవారం ఆమె పర్యటించి వరద తీవ్రత తదితర విషయాలను తెలుసుకున్నారు. కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు, కార్పొరేటర్ గాదం విజయ, ఎన్టీపీసీ పట్టణ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా, రమేశ్, సురేశ్ ఉన్నారు.

బ్రాహ్మణబంధు ఇవ్వండి

పెద్దపల్లిరూరల్: బ్రాహ్మణుల్లో ఎందరో నిరుపేదలున్నారని వారంతా ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం బ్రాహ్మణబంధు పథకాన్ని ప్రకటించాలని బ్రాహ్మణ సంఘ రాష్ట్ర నాయకుడు వెల్లంపల్లి శ్రీనివాసరావు కోరారు.

సర్పంచ్‌ను దూషించిన వ్యక్తిపై చర్య తీసుకోండి

మంథని: ముత్తారం మండలం సీతంపేట సర్పంచ్ పులిపాక నగేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మంథని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సర్పంచ్‌పై అదే గ్రామానికి చెందిన రాజమల్లు కులం పేరుతో దూషించారన్నారు. మండల అధ్యక్షుడు కొయ్యల మొండి, నాయకులు అడ్డూరి సమ్మయ్య, కొయ్యల దేవేందర్, అక్కపాక రమేశ్ ఉన్నారు.

ఎడతెరిపిలేని వాన

- ఇళ్లలోకి చేరిన వరదనీరు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- సహాయక చర్యల్లో స్థానికులు, పోలీసులు



సుల్తానాబాద్ రాజీవ్ రహదారిపై పారుతున్న వరద నీరు

సుల్తానాబాద్/రామగుండం/యైటింక్లయిన్‌కాలనీ/జూలపల్లి/ఫెర్టిలైజర్‌సిటీ/సుల్తానాబాద్‌రూరల్/ఓదెల/జ్యోతినగర్/ధర్మారం/కమాన్‌పూర్/ఎలిగేడు/రామగుండం: జిల్లావ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురిసింది. సుల్తానాబాద్‌లో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. రహదారుల వెంబడి వర్షం నీరు నిలవగా స్థానికులు సహాయ చర్యలు చేపట్టి నీటిని తొలగించారు. ఇళ్లల్లోకి నీరు చేరడంతో ఫ్రిజ్‌లు, బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు తడిచాయి. పెద్దపల్లి నుంచి సుల్తానాబాద్ మీదుగా కరీంనగర్‌కు వెళ్లే రాజీవ్ రహదారిపై నీరు చేరడంతో ప్రయాణికులు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. రామగుండం ఎస్టీ కాలనీ మీదుగా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం, ప్రభుత్వ ఐటీఐ విద్యా సంస్థలతో పాటు 20గ్రామాల ప్రజలకు కనెక్టివిటీ ఉన్న రహదారి మార్గంలో వరద నీటి ప్రవాహంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని రహదారులు అన్నీ జలమయమయ్యాయి. ఓదెల మండలంలోని పలు గ్రామాల్లో 15 చెరువులు 150కు పైగా కుంటలు నిండుకుండలా మారాయి. ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. కార్పొరేషన్ 23వ డివిజన్ మోమిన్ నగర్‌లో రెండోరోజు ఇండ్లలోకి వరద నీరు చేరింది. మూడో డివిజన అన్నపూర్ణ కాలనీలోని పలు వీధుల్లో వరద నీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మేడిపల్లి సెంటర్‌లో ప్రధాన కాలువ ఉప్పొంగడంతో నీరంతా రోడ్డు పైకి చేరింది. ఎలిగేడు మండలంలో వరి పొలాలు నీట మునిగాయి. కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో జోరువాన పడుతుండంతో చెరువు, కుంటలు నిండి అలుగుపారుతున్నాయి.



సుల్తానాబాద్: వరద నీటిలో సామగ్రి



సుల్తానాబాద్: ఇంట్లోకి చేరిన వరద నీరు



రామగుండం: గురుకుల ప్రధాన రహదారి



ఎలిగేడు మండలంలో నీటమునిగిన వరి



జ్యోతినగర్: నిలిచిన వరద నీరు



కోల్‌సిటీ: సప్తగిరికాలనీలోకి భారీగా చేరిన వరద నీరు



సుల్తానాబాద్ బస్టాండ్ ఎదుట రహదారిపై నిలిచిన వరద నీరు



జ్యోతినగర్: అన్నపూర్ణకాలనీలో వరద ఉధృతి



ఓదెల: కొలనూర్‌లో రైల్వేబ్రిడ్జి కింద పారుతున్న వరద



కమాన్‌పూర్: నూతులకుంటలో నీటి మునిగిన పంటపొలాలు



ఓదెల: నీట మునిగిన పంటపొలాలు

రైల్వేఅండర్ బ్రిడ్జి నిర్మాణం వద్ద నిలిచిన నీరు



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో నిర్మిస్తున్న రైల్వే అండర్‌బ్రిడ్జి పనుల వద్ద వర్షపు నీరు భారీగా నిలిచింది. సమీపంలో ఉన్న ఇండ్లలోకి వరద నీరు చేరే ప్రమాదముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రైల్వే అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్‌తో నీటిని తోడించాలని కోరుతున్నారు.

ఆర్టీసీ బస్టాండ్ జలమయం



వర్షం నీటిలో సీపీఎం నాయకుల నిరసన

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రమైన పెద్దపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ వర్షం నీరు నిలిచి చెరువును తలపిస్తోందని సీపీఎం నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. బస్టాండ్ నిర్మించిన నాటి నుంచి ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడంలేదని నాయకులు అశోక్, రవీందర్, దిలీప్, ప్రశాంత్, నవీన్, శివాజీ ఆరోపించారు. పాలకులు, అధికారులు స్పందించి ఆర్టీసీ బస్టాండ్‌ను అభివృద్ధి చేసి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు.

25 రోజులకే మంథని ఎస్సై బదిలీ

మంథని: బదిలీల్లో భాగంగా గత నెల 30న మంథనికి వచ్చిన ఎస్సై మధుసూదన్‌రావు బుధవారం రామగుండం కమిషనరేట్ పరిధిలో జరిగిన 11 మంది ఎస్సైల బదిలీల్లో మరోచోటికి మార్చారు. ముత్తారం ఎస్సైగా పోస్టింగ్ ఇచ్చారు. కాగా రామగుండం సీఎస్‌బీలో పనిచేస్తున్న కిరణ్‌కుమార్‌ను మంథనికి బదిలీ చేశారు.

కలెక్టర్‌ను కలిసిన రామగిరి ఎంపీపీ

కమాన్‌పూర్: కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను బుధవారం రామగిరి ఎంపీపీ ఆరెల్లి దేవక్క క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం రామగిరి మండలంలోని పలు సమస్యలపై వివరించారు. ఆరెల్లి కొమురయ్య ఉన్నారు.

పారిశుధ్య పనుల్లో వేగం పెంచాలి

పెద్దపల్లిరూరల్: వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనుల్లో వేగం పెంచాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి ఆదేశించారు. పెద్దపల్లిలో బుధవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారంరోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వార్డుల్లో నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. సమావేశంలో ప్రతిపాదించిన 49 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కమిషనర్ శ్రీనివాస రెడ్డి, మేనేజర్ శివప్రసాద్‌తో పాటు కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మమతారెడ్డి

ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై అవగాహన

పాలకుర్తి: మండలంలోని రామారావుపల్లి గ్రామంలో బుధవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై స్థానికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాలుగు రోజులుగా ప్రత్యేక మొబైల్ వాహనం ద్వారా ఈవీఎం, వీవీప్యాడ్‌లను వినియోగించి ఓటు వేసే విధానంపై అధికారులు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగానే రామారావుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల ప్రచార రథం ఇన్‌చార్జి శశిధర్ స్థానికులకు అవగాహన కల్పించారు. ఏఎస్సై గౌస్‌ఖాన్, ఆర్ఐ.అమృతకుమార్ పాల్గొన్నారు.

ఈవీఎం వీవీప్యాట్‌లపై అవగాహన

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామాల్లో ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై ప్రజలకు బుధవారం వ్యవసాయశాఖ అధికారి అరవింద్ అవగాహన కల్పించారు. సర్పంచ్ గంట పద్మ, ఎంపీటీసీ కొట్టె సందీప్, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, వీఆర్ఏలు రాజు, మధు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి శశిధర్

సంక్షిప్త వార్తలు

✦సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కమాన్‌పూర్: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన తాళ్ల లక్ష్మికి రూ.14,500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కు ప్రభుత్వం నుంచి మంజూరైంది. కాగా బుధవారం బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. సర్పంచ్ ఇటవేన కొమురయ్య, నాయకులు నడిగొట్టు సంపత్, దీకొండ కొమురయ్య, పెండ్లి నారాయణ, ఇటవేన కొమురయ్య, బొడ్డుపల్లి సతీశ్, రవి పాల్గొన్నారు.

✦న్యాయవాదుల నిరసన

గోదావరిఖనిటౌన్: మణిపూర్ ఘటనకు నిరసనగా బుధవారం స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించి తమ నిరసన తెలియజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడ చక్రపాణి న్యాయవాదులు పాల్గొన్నారు.

✦ఎల్‌వోసీ అందజేత

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామానికి చెందిన ఆకుల తిరుపతి చికిత్స కోసం ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రూ.1.50లక్షల ఎల్‌వోసీ చెక్కును బుధవారం హైదరాబాదులోని క్యాంపు కార్యాలయంలో తిరుపతి కుటుంబ సభ్యులకు అందించారు. తిరుపతి కొన్నిరోజులుగా అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆర్థిక సాయం అందించాలని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు తెలపగా సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎల్‌వోసీ చెక్కు అందించారు. ఎమ్మెల్యేకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

✦నలుగురు జీఎంలకు సన్మానం

గోదావరిఖని: ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న నలుగురు జీఎంలను బుధవారం ఆర్జీ–2 జీఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సెంట్రల్ వర్క్‌షాప్ జీఎం ఎల్‌వీ.గణపతి రావు, సీహెచ్‌పీ జీఎం సి.స్వామినాయుడు, జీఎం జి.సూర్యకుమార్, ఆగస్టు నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న వర్క్‌షాప్స్ జీఎం ఎన్.నాగేశ్వర్ రావును సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

✦నీటిని పొదుపుగా వాడుకోవాలి

గోదావరిఖని: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరినదిలో నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని ఆర్జీ–1 అధికార ప్రతినిధి లక్ష్మీనారాయణ తెలిపారు. నీటి మట్టం భారీగా పెరిగితే ఇన్‌టెక్‌వెల్‌లో ఉన్న పంపులు పనిచేయవన్నారు. అందువల్ల ఆర్జీ–1, 2, 3 ఏరియాల్లోని కార్మిక వాడలకు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. మూడు, నాలుగురోజుల పాటు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు.

✦ఉచిత ఆరోగ్య శిబిరం

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్ కేశోరాం కంపెనీ వర్కర్స్‌క్లబ్ ఆవరణలో బుధవారం సీఎస్‌సీ ఆరోగ్య సంరక్షణ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సంరక్షణ జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్ తిరుపతి మాట్లాడుతూ తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా లేబర్‌కార్డు పొందిన కార్మికులకు బుధ, గురువారం రెండు రోజులు ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బసంత్ నగర్ పరిధిలో మొత్తం 153 మంది కార్మికులకు గాను మొదటిరోజు కార్డు కలిగిన 40 మంది కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు భాస్కర్ తిరుపతి వెల్లడించారు.

సహాయక చర్యల్లో ఎన్టీపీసీ ఎస్సై జీవన్



సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న ఎస్సై జీవన్

జ్యోతినగర్: పట్టణంలోని 23వ డివిజన్ మోమీన్‌నగర్‌లో బుధవారం వరద నీటిలో చిక్కుకున్న ప్రజలను ఎస్సై బి.జీవన్ ధైర్యంగా వరద నీటిలోకి వెళ్లి తాడు సాయంతో సురక్షిత ప్రాంతానికి చేర్చారు. ప్రజలు ఎస్సైని అభినందించారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరికి జరిమానా

పెద్దపల్లిరూరల్: విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డ ఇరువురికి జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్ బుధవారం తీర్పునిచ్చారని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ స్వామి తెలిపారు. పట్టణంలోని బండారికుంటకు చెందిన పులిపాక మహేందర్, ముత్తారం మండలం శుక్రవారంపేటకు చెందిన మడుపు రమేశ్ అక్రమంగా విద్యుత్ వినియోగిస్తూ పట్టుబడ్డారని పేర్కొన్నారు. కేసు విచారించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహేందర్‌కు రూ.13811, మడుపు రమేశ్‌కు రూ.6965 జరిమానా లేదా మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని వివరించారు.

లోతట్టు ప్రాంతాల సందర్శన

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలను బుధవారం రాత్రి కాంగ్రెస్ ప్రతినిధులు సందర్శించి ప్రజలకు భరోసా కల్పించారు. అంతర్గాం మండల కేంద్రంలోని పలు కాలనీలను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి జనక్ ప్రసాద్ తన అనుచరులతో పర్యటిస్తూ భారీ వర్షాలతో వరద ముంపునకు గురవుతున్న కాలనీలను సందర్శించారు. పార్టీ ప్రతినిధులు ధర్మపురి, వంగ లక్ష్మీపతిగౌడ్, వడ్డెపల్లి దాసు, పూసాల తిరుపతి, సదానందం, సందీప్‌కుమార్, ఆంజనేయులు, నాగరాజు, శ్రీనివాస్, రాజేశం, అన్వేష్, రాజు, పృథ్వీ, సంపత్ ఉన్నారు.

వరద ముంపు ప్రాంతాల్లో మేయర్ పర్యటన

రామగుండం: పట్టణంలోని మజీద్‌కార్నర్, జీరోపాయింట్ ఏరియా కాలనీలోని ఇళ్లలోకి బుధవారం కురిసిన భారీ వర్షానికి వరద నీరు ముంచెత్తింది. నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, స్థానిక కార్పొరేటర్ కౌశిక లత క్షేత్రస్థాయిలో పర్యటించి వరద ముంపునకు గురైన గృహాలను పరిశీలించారు. అనంతరం జేసీబీ సాయంతో వరద నీటిని మళ్లించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు.



పరిశీలిస్తున్న మేయర్ అనిల్‌కుమార్

బియ్యం అందజేత

జ్యోతినగర్: కార్పొరేషన్ 23వ డివిజన్‌లో వరద ముంపునకు గురైన 100 బాధిత కుటుంబాలకు 10కిలోల చొప్పున బియ్యాన్ని డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు పంపిణీ చేశారు. జెన్‌కోకు చెందిన బూడిద చెరువు కట్ట తెగి సుభాష్‌నగర్, మోమీన్‌నగర్ నీట మునిగిందని, బాధితులను ఆదుకుంటామని భరోసా కల్పించారు. బుర్ర శంకర్‌గౌడ్, ఆనంద్, వీరాలాల్, శంకర్, చందు పాల్గొన్నారు.

కార్గిల్ వీరులకు నివాళి

గోదావరిఖని: కార్గిల్ యుద్ధంలో అమరులైన వీరులకు బుధవారం మాజీ సైనికోద్యోగులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎస్.గంగరాజు, నాయకులు శ్రీనివాస్, సతీశ్, శ్యాం కుమార్, శంకర్‌రావు, భాస్కర్ పాల్గొన్నారు. జ



నివాళి అర్పిస్తున్న మాజీ సైనికులు

ఆర్మీ జవాన్లకు సన్మానం

ధర్మారం: కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని ధర్మారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఇద్దరు జవాన్‌లను సన్మానించారు. ధర్మారం మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పుచ్చకాయల మునీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్మీ జవాన్‌లు సతీశ్, మహేశ్‌ను సన్మానించారు. లయన్స్ క్లబ్ కోర్ కమిటీ సభ్యుడు సామ ఎల్లారెడ్డి, జిల్లా చైర్‌పర్సన్ కామని శ్రీనివాస్, కోశాధికారి దయానంద్, సభ్యులు తలమక్కి రవీందర్‌శెట్టి, ఇప్ప మల్లేశం, అబ్దుల్ ముజాహిద్, మిట్ట రవి, ఎండీ బాబా పాల్గొన్నారు.

కొనసాగిన పంచాయతీ కార్మికుల సమ్మె

జూలపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట వేసిన దీక్షా శిబిరంలో కార్మికులు నిరసన తెలిపారు.

ఎలిగేడు: మండలకేంద్రంలో జీపీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య, శ్రీనివాస్, దేవయ్య, ఓదెలు, నర్సయ్య, సరీన్, శ్రీనివాస్, మొగిలి, కొండయ్య పాల్గొన్నారు.

ఓదెల: ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె మండలంలో కొనసాగుతోంది.

కాల్వశ్రీరాంపూర్: జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్‌లో కార్మికులు చేపట్టిన దీక్షలో పాల్గొని మద్దతు తెలిపారు.

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద 21రోజులుగా పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. బుధవారం వాన కురుస్తున్నా కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు.

31వ సారి రక్తదానం


యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దేవమ్మ అనే మహిళకు కాలనీకి చెందిన వైకే ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్ బుధవారం 31వసారి రక్తదానం చేశారు. దేవమ్మకు రక్త తగ్గడంతో అత్యవసరంగా బీ ప్లస్ రక్తం కావాల్సిందిగా వైద్యులు సూచించారు. రోగి కుటుంబ సభ్యులు వెంటనే వైకే ఫౌండేషన్ అధ్యక్షుడు కండెం సురేశ్‌కు సమాచారం అందించారు. సురేశ్ వెంటనే అనిల్ కుమార్‌కు తెలపడంతో ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు. పేషేంట్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



రక్తదానం చేస్తున్న అనిల్

బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం

గోదావరిఖనిటౌన్: బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం స్థానిక గంగానగర్‌లోని స్వాగత్ గార్డెన్‌లో జరిగింది. ఉదయం దేవతార్చన పూజా కార్యక్రమంతో సమ్మేళనం ప్రారంభించారు. అనంతరం బ్రాహ్మణ సంఘం సీనియర్ నాయకులు కటకం మృత్యుంజయం హాజరై మాట్లాడారు. స్థానికంగా వేదపాఠశాలకు భవనం కేటాయించాలని స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను కోరారు. బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకురాలు శిల్ప, గోదావరిఖని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మల్లావొజ్జల వంశీ, రామగుండం కార్పొరేషన్ ఏరియా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వొజ్జాల వెంకటేశ్వర్లు శర్మ, ఉపాధ్యక్షుడు సోమయాజులు, ప్రధాన కార్యదర్శి రుద్రబట్ల రమేశ్, నాయకులు జగన్నాథచార్యులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న మృత్యుంజయం